www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

## అప్పటి వీడియోలు ఇప్పుడెందుకు?

**చిరంజీవిపై సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు**
**గతంలో చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలను అప్పడే వెనక్కి తీసుకున్నానన్న నారాయణ**
**అప్పటి వీడియోలను వైరల్ చేస్తూ తనను బద్నాం చేస్తున్నారని మండిపాటు**
**తెలుగు రాష్ట్రాల్లో బ్లాక్ మెయిల్ రాజకీయాలు నడుస్తున్నాయని విమర్శ**

హైదరాబాద్, (సిద్దిపేట పవర్)

అగ్ర నటుడు చిరంజీవిపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో ఆరోపణలు సహజమేనని... అయితే మాట్లాడే ముందు చిరంజీవి విజ్ఞతతో మాట్లాడాలని అన్నారు. గతంలో తాను చిరంజీవి గురించి మాట్లాడానని... ఆ వ్యాఖ్యలను అప్పుడే వెనక్కి తీసుకున్నానని చెప్పారు. అయితే, ఆ వీడియోలను ఇప్పుడు వైరల్ చేస్తూ తనను బద్నాం చేయడం సరికాదని అన్నారు. ఈ విషయాన్ని చిరంజీవికే వదిలేస్తున్నానని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బ్లాక్ మెయిల్ రాజకీయాలు నడుస్తున్నాయని నారాయణ అన్నారు. ఏపీలో జగన్, తెలంగాణలో కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని విమర్శించారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు చేసినవే ఇప్పుడు రిపీట్ అవుతున్నాయని చెప్పారు.

గతంలో జగన్ చేసిన అక్రమాలు ఇప్పుడు ప్రభుత్వం మారిన తర్వాత ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని నారాయణ అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బీసీలపై సడన్ గా అంత ప్రేమ ఎలా వచ్చిందో అర్థం కావడం లేదని అన్నారు. అసలు ఏ పార్టీ తరపున ఆమె బీసీ జపం చేస్తున్నారో తెలియడం లేదని ఎద్దేవా చేశారు.

సంపుటి: 01 | సంచిక: 140 | హైదరాబాద్ | శుక్రవారం | 08-08-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు



## రాహుల్ గాంధీ ఆరోపణలు..

- ప్రమాణం చేసి ఫిర్యాదు చేయాలన్న ఈసీ
- కర్ణాటకలో ఓట్ల దొంగతనం జరిగిందన్న రాహుల్ గాంధీ
- మహదేవపుర నియోజకవర్గంలో భారీగా అవకతవకలని ఆరోపణ
- ఆరోపణలను తీవ్రంగా ఖండించిన భారత ఎన్నికల సంఘం
- ప్రమాణం చేసి ఫిర్యాదు చేయాలంటూ రాహుల్‌కు సవాల్
- రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు
- రాజ్యాంగ సంస్థలను కించపరచడమే కాంగ్రెస్ పనన్న విమర్శ

2

## కేసీఆర్ భిక్ష వల్ల ఎమ్మెల్యే కాలేదు..

- గువ్వల సంచలన వ్యాఖ్యలు..



2



## ట్రంప్ 50 శాతం సుంకాలు విధించారు...

- భారత్‌పై అమెరికా 50 శాతం సుంకం విధించడంపై ఒవైసీ తీవ్ర ఆగ్రహం
- ఇది దౌత్యం కాదు, ట్రంప్ దాదాగిరి అంటూ ఘాటు విమర్శ
- సుంకాల వల్ల ఉద్యోగాలు పోతాయి, ఎఫ్‌డీఐలు రావని ఆందోళన

2



## బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది...

- అందరి లెక్కలు సరిచేస్తాం: కేటీఆర్
- రేవంత్ పాలన విచిత్రంగా ఉందన్న కేటీఆర్
- రాష్ట్రంలో భూముల విలువ పడిపోయిందని వ్యాఖ్య
- కేసీఆర్ అంటే రేవంత్

2

## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన... ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక విజ్ఞప్తి



- హైదరాబాద్‌లో భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని నగర ప్రజలకు విజ్ఞప్తి
- అర్ధరాత్రి వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వెల్లడి
- లోతట్టు ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశం
- రాష్ట్రంలోని పలు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచన
- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు స్పష్టం

2

# తమ్మిడిహట్టి పట్టుకొని గోదారి ఈదొచ్చా!?

- తమ్మిడిహట్టి ఎంపికపైతంత్రం లేదు తర్కం లేదుతలతిక్క సూత్రీకరణే!
- అసాధ్యమని తెలిసినా కాంగ్రెస్ డొల్ల వాదన
- తమ్మిడిహట్టి వద్ద బరాజ్ కట్టాలన్న నిపుణులెవరో చెప్పరెందుకు?
- అక్కడ బరాజ్ కట్టడాన్ని సమర్థించిన కేంద్ర సంస్థలేవో వెల్లడించరు
- 152 మీటర్లకు ఒప్పందం జరిగిందంటూనే ఆ కాపీని బయటపెట్టరు
- జలసంఘం సాధ్యంకాదన్నా, మహారాష్ట్ర ససేమిరా అన్నా, అదే ధోరణి
- చాత్రాల్ వైల్డ్‌లైఫ్‌లో అనుమతులు రావని తెలిసీ అదే వితండవాదన
- కేంద్రంలో, రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉండీ బరాజ్ కట్టలేదేం?
- మహారాష్ట్రలో కాంగ్రెస్సే అధికారంలో ఉన్నా తట్టెడు మట్టి తీయలేదేం
- 2014 దాకా తమ్మిడిహట్టిపై కాంగ్రెస్ చేసిందేంది? ఇప్పుడేమున్నది?



తెలంగాణ బ్యూరో, (సిద్దిపేట పవర్):

కుక్క తోక పట్టుకొని గోదారి ఈదొచ్చా?! 'అరె... ఈదలేమయ్యా బాబూ' అంటే కొందరు వినరు. సస్తే నమ్మరు. ఈదమంటే ఈదరు. అయినా కుక్క తోకతో గోదావరిలో ఆ గట్టు నుంచి ఈ గట్టుకు ఈదొచ్చని వాదిస్తరు. గజఈతగాళ్లు వచ్చి అది సాధ్యం కాదని చెప్పినా నమ్మమంటరు. పైగా కుక్కతోక పట్టుకొని ఎందుకు ఈదలేదని ఎదుటి వాళ్లను నిందిస్తరు. కమిషన్లు వేసి మరీ కుక్కతోకను కీర్తిస్తరు. ప్రాణహిత జలాల మళ్లింపులో తమ్మిడిహట్టి మీద కాంగ్రెస్ నాయకుల తీరు కూడా ఇట్లనే తయారైంది.

అసలు తమ్మిడిహట్టి దగ్గర బరాజ్ కట్టమన్నదెవరో తెల్వదు. అక్కడి నుంచి నీళ్లను మళ్లించాలని అధ్యయనం చేసిందెవరో తెల్వదు. కనీసం బరాజ్ కట్టేందుకు మహారాష్ట్ర ఒప్పుకుంటుందా.. అనే ఆలోచన కూడా చేయరు. మనుషులు సంచరించడంపైనే నిషేధమున్న వన్యప్రాణి అభయారణ్యం పరిధిలో బరాజ్ కట్టి పదహారు లక్షల ఎకరాలకు నీళ్లిస్తమని తెలంగాణ ప్రజలను మభ్య పెడతరు. అక్కడ నీళ్లే లేవయ్యా.. అని ఓ కేంద్రమంత్రి లేఖ రాసినా పట్టించుకోరు. కేంద్ర జలసంఘం లెక్కలతో సహా శాస్త్రీయంగా నచ్చజెప్పినా మనసుకు ఎక్కించుకోరు. 18 సంవత్సరాలుగా అదే వింత పోకడ, వితండ వాదన.

మరి.. గతంలో పదేండ్లు అధికారంలో ఉండీ అక్కడ మీరెందుకు కట్టలేదని అడిగితే బదులియ్యరు. కనీసం అంతర్రాష్ట్ర ఒప్పందం చేసుకున్నామన్నారు కదా.. అదైనా బయట పెట్టండంటే సమాధానం ఉండదు. సవాల్ చేస్తే పత్తా లేకుండపోతరు. మొదటినుంచీ కాంగ్రెస్ నేతల తీరిదే. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావస్తున్నా తమ్మిడిహట్టి దగ్గర మాత్రం తట్టెడు మట్టి పని మొదలుపెట్టరు. చివరకు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిషన్ వేసి మరీ.. అదే కుక్కతోకలాంటి తమ్మిడిహట్టి చాలా గొప్పదని

మిగతా 4వ పేజీలో..

# రాహుల్ గాంధీ ఆరోపణలు..

- ప్రమాణం చేసి ఫిర్యాదు చేయాలన్న ఈసీ
- కర్ణాటకలో ఓట్ల దొంగతనం జరిగిందన్న రాహుల్ గాంధీ
- మహదేవపుర నియోజకవర్గంలో భారీగా అవకతవకలని ఆరోపణ
- ఆరోపణలను తీవ్రంగా ఖండించిన భారత ఎన్నికల సంఘం
- ప్రమాణం చేసి ఫిర్యాదు చేయాలంటూ రాహుల్‌కు సవాల్
- రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు
- రాజ్యాంగ సంస్థలను కించపరచడమే కాంగ్రెస్ పనన్న విమర్శ



**జాతీయం, (సిద్దిపేట పవర్) :**

లోక్‌సభ ఎన్నికల్లో 'ఓట్ల దొంగతనం' జరిగిందంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) తీవ్రంగా స్పందించింది. రాహుల్ వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, ఆయన తన ఆరోపణలపై నమ్మకం ఉంటే ప్రమాణ పూర్వకంగా ఫిర్యాదు చేయాలని గురువారం స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఫ్యాక్ట్ చెక్' పేరుతో ఒక ప్రకటన విడుదల చేసింది.

"మీరు చెప్పేది నిజమే అయితే, ఈ సాయంత్రంలోగా కర్ణాటక ఎన్నికల అధికారికి ప్రమాణ స్వీకార పత్రం సమర్పించాలి. తద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఒకవేళ మీ ఆరోపణలపై మీకే నమ్మకం లేకపోతే, అర్థరహితమైన అభిప్రాయాలకు రావడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలి" అని ఈసీ రాహుల్‌కు హితవు పలికింది.

అంతకుముందు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో భారీ ఎత్తున ఎన్నికల మోసం జరిగిందని రాహుల్ ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఇలాంటి అవకతవకలు జరుగుతున్నాయని అన్నారు. బెంగళూరు సెంట్రల్‌లో బీజేపీకి 32,707 ఓట్ల ఆధిక్యం రాగా, ఒక్క మహదేవపురలోనే ఆ పార్టీకి 1,14,046 ఓట్ల భారీ ఆధిక్యం ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఈ ఒక్క సెగ్మెంట్‌లోనే దాదాపు 1,00,250 ఓట్లను దొంగిలించారని, బీజేపీతో కుమ్మక్కై ఈసీయే ఈ మోసానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. డూప్లికేట్ ఓటర్లు, ఇతర రాష్ట్రాల్లోనూ ఓట్లు ఉన్నవారి పేర్లను ఆయన ఉదహరించారు.

**రాహుల్ వ్యాఖ్యలపై కేంద్రం ఆగ్రహం**

రాహుల్ గాంధీ ఆరోపణలను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా ఖండించారు. రాహుల్, ఆయన బృందం చేస్తున్న వాదనలు నిరాధారమైనవని, రాజకీయ ప్రేరేపితమైనవని విమర్శించారు. ఎన్నికల సంఘం ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రానప్పుడు సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలను కించపరచడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని ఆయన అన్నారు. ఓటర్ల జాబితా సవరణ అనేది స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జరుగుతున్న ప్రక్రియేనని, ఇందులో కొత్తగా చేస్తోంది ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు.



## ట్రంప్ 50 శాతం సుంకాలు విధించారు...

- బీజేపీ నేతల ప్రగల్భాలు ఇప్పుడేమయ్యాయి?: ఒవైసీ
- భారత్‌పై అమెరికా 50 శాతం సుంకం విధించడంపై ఒవైసీ తీవ్ర ఆగ్రహం
- ఇది దౌత్యం కాదు, ట్రంప్ దాదాగిరి అంటూ ఘాటు విమర్శ
- సుంకాల వల్ల ఉద్యోగాలు పోతాయి, ఎఫ్‌డీఐలు రావని ఆందోళన
- ప్రధాని మోదీ 56 అంగుళాల ఛాతీ ఏమైందని సూటి ప్రశ్న
- దేశ సార్వభౌమత్వాన్ని మిత్రుల కోసం తాకట్టు పెట్టారని ఆరోపణ

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్) :**

భారత్‌పై అమెరికా భారీ సుంకాలను విధించడంపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా 50 శాతం సుంకం విధించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇది దౌత్యం కాదని, అమెరికా అధ్యక్షుడి దాదాగిరి అని గురువారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు.

అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల భారత ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. "ట్రంప్ మనపై మరో 25 శాతం సుంకాన్ని విధించారు, దీంతో మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. అంతర్జాతీయ వాణిజ్యం ఎలా పనిచేస్తుందో తెలియని వ్యక్తి మనల్ని బెదిరిస్తున్నారు," అని ఆయన పేర్కొన్నారు. ఈ సుంకాల వల్ల భారత ఎగుమతిదారులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), తయారీదారులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. అంతేకాకుండా, సరఫరా గొలుసులు దెబ్బతిని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గిపోయి, ఉద్యోగాలకు గట్టి దెబ్బ తగులుతుందని ఆయన హెచ్చరించారు.

ఈ పరిణామాలపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనాన్ని ఒవైసీ తీవ్రంగా ప్రశ్నించారు. "ఈ విషయాలు నరేంద్ర మోదీకి ఎందుకు పట్టడం లేదు? బీజేపీ నేతల ప్రగల్భాలు ఇప్పుడు ఏమయ్యాయి?" అని నిలదీశారు. గతంలో ట్రంప్ 56 శాతం సుంకాలు విధిస్తే మోదీ తన 56 అంగుళాల ఛాతీని చూపిస్తారా అని తాను ప్రశ్నించానని, బహుశా అందుకే ట్రంప్ 50 శాతంతో ఆగిపోయారేమోనని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని మీ మిత్రులైన బిలియనీర్ల ఖజానాలు నింపడం కోసం తాకట్టు పెట్టారా?" అని ఒవైసీ ప్రశ్నించారు.

జూలై 31న కూడా ఇదే అంశంపై స్పందించిన ఒవైసీ, భారత్ ఒక స్వతంత్ర సార్వభౌమ దేశమని, అమెరికాకు సామంతు రాజ్యం కాదని అన్నారు. జపాన్‌పై 15 శాతం, వియత్నాంపై 20 శాతం, ఇండోనేషియాపై 19 శాతం సుంకాలు విధిస్తూ, భారత్‌పై మాత్రం కక్షపూరితంగా వ్యవహరించడం మన పోటీతత్వాన్ని దెబ్బతీస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ఢిల్లీలో బీసీ రిజర్వేషన్ ధర్నాకు రాహుల్, ఖర్గే డుమ్మా.. క్లారిటీ ఇచ్చిన మంత్రి..



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్) :**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోరుతూ టీపీసీసీ ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన మహాధర్నాకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గైర్హాజరైన విషయం తెలిసిందే..ఈ అంశంపై చీట్ చాట్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్లారిటీ ఇచ్చారు. ఢిల్లీ ధర్నాకు ఇండియా కూటమి నేతలు వచ్చారని తెలిపారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జార్ఖండ్ మాజీ సీఎం శిబుసోరేన్ అంత్యక్రియలకు వెళ్లారని అందుకే గైర్హాజరైనట్టు తెలిపారు. ఇండియా కూటమిలో కీలక నేత చనిపోతే పోకుంటే ఎలా..? అని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌కి పుస్తకాలు రాసే అలవాటు ఉంటే. పదేళ్లలో ఎన్నో పుస్తకాలు రాసే వాళ్ళమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కేటీఆర్.. 20 నెలలకే పేర్లు రాసి పెడతా అంటున్నారని.. తాము పదేళ్లలో ఎంతో ఇబ్బంది పడ్డామన్నారు. వాళ్ళ లాగ తాము అరెస్టులు.. కేసులు పెట్టడం లేదన్నారు. నో పాలిటిక్స్... తనకు అభివృద్ధి ముఖ్యమన్నారు. నేషనల్ హైవే పనుల మీద ఢిల్లీలో ఉన్నట్లు తెలిపారు. AMRP లైనింగ్ టెండర్లు వచ్చే నెల ఉంటుంది. Slbc పూర్తి చేద్దాం అనుకుని పని మొదలు పెడితే... దిష్టి తగిలినట్టుంది.. కూలిందన్నారు. జగదీష్‌రెడ్డి లాంటి వాళ్ళ పేర్లు నా ముందు తియ్యకండి. జగదీశ్ రెడ్డి లెవెల్‌కి నన్ను దిగజార్చకండని అసహనం వ్యక్తం చేశారు. సినిమా కార్మికుల సమస్యలపై స్పందిస్తూ.. రేపు సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దిల్ రాజు వాళ్ళను రేపు రమ్మని చెప్పానని... కార్మికుల సమస్యలపై చర్చ చేసి మాట్లాడతానన్నారు.



## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన...

- ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక విజ్ఞప్తి
- హైదరాబాద్‌లో భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని నగర ప్రజలకు విజ్ఞప్తి
- అర్ధరాత్రి వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వెల్లడి
- లోతట్టు ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశం
- రాష్ట్రంలోని పలు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచన
- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు స్పష్టం

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్) :**

హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షాలు ముంచెత్తుతున్న నేపథ్యంలో, ప్రజలు అత్యవసరమైతే తప్ప తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నగరంలో కురుస్తున్న కుండపోత వానలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి, అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్‌లో అర్ధరాత్రి వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినట్లు సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ, పోలీసు, ట్రాఫిక్, జలమండలి (హైడ్రా) అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రానున్న రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున, అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. వర్షాలు, వరదల వల్ల ఏవైనా అనుకోని పరిస్థితులు ఎదురైతే, వాటిని ఎదుర్కొనేందుకు అధికారులు సర్వసన్నద్ధంగా ఉండాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఆయన గట్టిగా సూచించారు.

## బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది... అందరి లెక్కలు సరిచేస్తాం: కేటీఆర్

- రేవంత్ పాలన విచిత్రంగా ఉందన్న కేటీఆర్
- రాష్ట్రంలో భూముల విలువ పడిపోయిందని వ్యాఖ్య
- కేసీఆర్ అంటే రేవంత్ భయపడుతున్నారన్న రేవంత్

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్) :**

రాబోయే రెండున్నరేళ్లలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని... అప్పుడు అందరి లెక్కలు సరిచేస్తామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. రేవంత్ రెడ్డి పాలన విచిత్రంగా ఉందని... ఏం చేస్తున్నారో ఆయనకే అర్థం కావడం లేదని అన్నారు. యూరియా కోసం రైతులు కష్టపడాల్సి వస్తోందని చెప్పారు. రాష్ట్రంలో భూముల విలువలు పడిపోయాయని అన్నారు. బీఆర్ఎస్ పాలనా సమయంలో రేషన్ కార్డులు ఇవ్వలేదని ఐఏఎస్ అధికారులు అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఐఏఎస్ అధికారులు రాజకీయాలు మాట్లాడటం సరికాదని అన్నారు. తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రుణమాఫీ విషయంలో రేవంత్ ప్రభుత్వం విఫలమయిందని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతుబంధును ప్రభుత్వం నిలిపివేస్తుందని చెప్పారు. కేసీఆర్ అంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని... అందుకే ఢిల్లీలో కూడా కేసీఆర్ నే విమర్శిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన మంచి పనులను తమ పార్టీ కార్యకర్తలు ప్రజలకు చెప్పలేకపోయారని... అందుకే ఓడిపోయామని చెప్పారు. కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేసుకునేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



## కేసీఆర్ బిక్ష వల్ల ఎమ్మెల్యే కాలేదు..

- గువ్వల సంచలన వ్యాఖ్యలు..

**తెలంగాణ బ్యూరో, (సిద్దిపేట పవర్) :**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కేవలం కేసీఆర్ ఒక్కరే పోరాటాలు చేశారా? అని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. తాజాగా ఎన్టీవీ క్వశ్చన్ హవర్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది పోరాటం చేశారు. అయినప్పటికీ కేసీఆర్ పట్టువిడవకుండా పోరాటం చేశారని ప్రశంసిస్తూ వచ్చానన్నారు. కేసీఆర్ బిక్ష వల్లే ఎమ్మెల్యే అయ్యారు. టీఆర్ఎస్ పార్టీ లేకుంటే.. కేసీఆర్ లేకుంటే మీరు ఎమ్మెల్యే అయ్యేవారే కాదు. మీరు వార్డు మెంబర్‌కే సరిపోరు అనే విధంగా నేడు బీఆర్ఎస్ విమర్శలు చేయిస్తోందని మండిపడ్డారు. అదెక్కటి సంస్కృతి అంటూ నిలదీశారు. అయితే.. తెలంగాణ పోరాటం లక్షల మంది చేశారు కదా.. వారందరినీ ఎమ్మెల్యేలుగా చేసేది ఉండే.. మీరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్నే ఎందుకు ఎంచుకున్నారు? అని సూటిగా ప్రశ్నించారు. తాము ఎంత త్యాగం చేశామో.. ఎన్ని పోరాటాలు చేశామో తమకు తెలుసన్నారు. తన జీవితంలో జరిగిన ఓ సంఘటన తనను శాసనసభలోకి అడుగుపెట్టేలా చేసిందన్నారు. కేసీఆర్ చెప్పిందే తూచా తప్పకుండా పాటించానని గువ్వల బాలరాజు అన్నారు.. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడంతోనే అవకాశాలు వచ్చాయని... ఏ పార్టీ తనను కొనుగోలు చేసే ప్రయత్నం చేయలేదన్నారు.. ఏ పార్టీలో చేరుతాననే విషయం ఇప్పటికీ ప్రకటించలేదని.. త్వరలోనే అన్ని విషయాలు తెలుస్తాయన్నారు.. ఫామ్‌హౌస్ ఎపిసోడ్ కూడా ఓటమికి ఓ కారణమన్నారు.

"అచ్చంపేటలో నన్ను మించి పోటీ చేసేంత స్థాయి కార్యకర్త, నాయకుడు బీఆర్ఎస్‌లో లేరు. నాకు అక్కడ పొంచి ఉన్న ప్రమాదం కూడా ఏం లేదు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి రాజీనామా చేయాల్సి వచ్చింది తప్ప.. నా అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. పొలిటికల్‌గా థ్రెట్ ఉంది నాకు అనేది ఏం లేదు. అచ్చంపేట ప్రజలు నన్ను రెండుసార్లు ఆశీర్వదించారు.. బీఆర్ఎస్‌లో నా ఆశయాలకు అనుకున్న స్థాయిలో గౌరవం దక్కలేదు.. కేసీఆర్ అధికారం కోల్పోయాక ఇంటినుంచే ఆదేశాలిచ్చారు.. ప్రభుత్వాన్ని కేసీఆర్ సరిగ్గా ప్రశ్నించడం లేదు.. సమస్యలపై బీఆర్ఎస్ అగ్రనేతలు పోరాటం చేయట్లేదు.. ప్రజల ఎజెండాగా ముందుకెళ్లాలని ఎన్నోసార్లు చెప్పా.. కవిత వ్యవహారంతో అందరూ గందరగోళానికి గురవుతున్నారు.. నా పొలిటికల్ కెరీర్‌కు ఎలాంటి ప్రమాదం లేదు." అని గువ్వల బాలరాజు వ్యాఖ్యానించారు.



## హైదరాబాద్‌లో యుఎస్ కాన్సుల్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టిన లారా విలియమ్స్..



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్) :**

హైదరాబాద్‌లో కొత్త యుఎస్ కాన్సుల్ జనరల్‌గా లారా విలియమ్స్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో యుఎస్ కాన్సుల్ జనరల్‌గా పనిచేయడం తనకు ఎంతో గర్వకారణమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా అంతటా యుఎస్‌ఇండియా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి తాను ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. భారత్, అమెరికా మధ్య దౌత్య సంబంధాలను మెరుగుపర్చడానికి తాను ప్రాధాన్యమిస్తానని స్పష్టం చేశారు. ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు తాను కట్టుబడి ఉన్నానన్నారు. హైదరాబాద్‌ను గొప్ప ప్రాంతంగా అభివర్ణించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ స్థానంలో లారా విలియమ్స్ వచ్చారు. ఆమె గతంలో యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్‌లో ఎంటర్‌ప్రైజ్ సర్వీసెస్‌కు డిప్యూటీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా పనిచేశారు. వాషింగ్టన్‌లోని దౌత్యవేత్తలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న రాయబార కార్యాలయాలను అనుసంధానించే సమాచార సాంకేతిక వేదికల సూట్‌ను నిర్వహించారు. తన కెరీర్ మొత్తంలో సున్నితమైన డేటాను భద్రపరచడం, ప్రజా దౌత్యాన్ని విస్తృతం చేయడానికి వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వంటి విధులు చేపట్టారు. నికోసియా, అల్జీర్స్, రోమ్, మెక్సికో నగరాల్లోని అమెరికా రాయబార కార్యాలయాలలో విధులు నిర్వర్తించారు. వాషింగ్టన్, డి.సి. లోని విదేశాంగ శాఖ ప్రధాన కార్యాలయంలో సైతం డిప్లొమాటిక్ టెక్నాలజీ బ్యూరో, సెక్రటరీ ఆపరేషన్స్ సెంటర్, రిక్రూట్‌మెంట్ ఆఫీస్, ఫారిన్ సర్వీస్ ఇన్‌స్టిట్యూట్ స్కూల్ ఆఫ్ అప్లైడ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సైబర్‌స్పేస్, డిజిటల్ పాలసీ బ్యూరో, సెంటర్ ఫర్ అనలిటిక్స్ వంటి పదవులతో సహా విభిన్న పోర్ట్‌ఫోలియోలను నిర్వహించారు.



## కార్యకర్తకు అండగా బిఆర్ఎస్ పార్టీ...

**చేర్యాల, ఆగస్టు 7 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండలం నాగపూరి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు మల్లిగారి మురళి గారి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా నిలిచి 10000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది..ఈ సందర్భంగా తాజా మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్ మాట్లాడుతూ మా బి.ఆర్.ఎస్.కుటుంబంలో ఒక వ్యక్తిని కోల్పోవడం చాలా బాధగా ఉంది అని తెలిపారు..అదే విదంగా మురళి కుటుంబానికి భవిష్యత్తులో అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు..ఈ ఆర్థిక సహాయానికి సహకరించిన ప్రతీ ఒక్క బి.ఆర్.ఎస్ నాయకునికి ప్రత్యేక ధన్యవాదాలు అని కరుణాకర్ తెలిపారు.



## తల్లి పాలు బిడ్డకు ఎంతో మేలు

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 7 ప్రతినిధి**

దుబ్బాక మండల పరిధిలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా దుబ్బాక ప్రాజెక్ట్ రామక్క పేట సెక్టార్ రాజక్కపేట్ 3 సెంటర్ లో 6 నెలలు నిండిన పిల్లలకు అన్న ప్రాసన,ప్రీ స్కూల్ పిల్లలకు జన్మదిన వేడుకలు మరియు స్వచ్ఛత ఫ్రెండ్లీ రాఖీ వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్వరూప మాట్లాడుతూ ప్రతి తల్లి 6 నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని, 6నెలలు నిండిన తర్వాత వారికి బాలామృతం ఇవ్వాలని సూచించారు.తల్లి పాలు బిడ్డకు ఇవ్వడం శ్రేష్టం అని అన్నారు.తల్లి పాలు మరియు బాలా మృతంలో ఉండే పోషకాల గురించి అవగాహన కల్పించారు. పుట్టినరోజు జరుపుకున్న పేరెంట్స్ పిల్లలకు ఆట వస్తువులు కొనివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్వరూప, సెక్రటరీ రవి కుమార్,ఎఎన్ ఎమ్ శైలజ,అంగన్వాడి టీచర్ చైతన్య, ఐ కె పి సి ఎ లావణ్య,మహిళ గ్రూప్ సభ్యులు,బాలింతలు, గర్భిణీ స్త్రీలు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## వినూత్నంగా రక్షా బంధన్..
## చెట్లకు రాఖీ కట్టిన విద్యార్థులు

**చేర్యాల, ఆగస్టు 7 (సిద్దిపేట పవర్)**





అన్న,చెల్లెళ్ళ మధ్య ఉన్న అనుబంధాలకు సూచకంగా దేశ వ్యాప్తంగా రాఖీ పండుగ నిర్వహించుకుంటుంటే.. రాంపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో వినూత్నంగా "మనం చెట్లకు రక్షణచెట్లు మనకు రక్షణ" అంటూ వృక్షాలకు గులాబి పువ్వులతో అల్లిన రాఖిలను ఒకరికొకరు రాఖి కట్టి వినూత్న రీతిలో రాఖీ పండుగ నిర్వహించారు. చేర్యాల మండలంలోని రాంపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం వేణు, ఉపాధ్యాయురాలు నందిని ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు ఒకరికొకరు గులాబి పువ్వులతో అల్లిన రాఖీలను కట్టుకున్నారు. అనంతరం విద్యార్థులు రాఖీలను చెట్లకు కట్టి వృక్షో రక్షతి రక్షితః" అంటూ పాఠశాల ఆవరణలో చెట్లకు రాఖీ కట్టి ప్రతిజ్ఞ నిర్వహించి శుభాకాంక్షలు తెలుపుకొని మిఠాయిలు తినిపించుకున్నారు.అనంతరం మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.



## అఖిలభారత ఓబీసీ పదవ జాతీయ మహాసభలకు గోవ రాష్ట్రంలో సభలో పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి

**సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 8.**

అఖిలభారత ఓబీసీ పదవ జాతీయ మహాసభలు ఈ సంవత్సరం గోవ రాష్ట్రంలో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా నాయకులు, మెదక్ జిల్లా బీసీ నాయకులు, పెద్ద మొత్తంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ గారి ఆధ్వర్యంలో గోవా రాష్ట్రానికి బయలుదేరి ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. రాష్ట్ర అధికార ప్రతినిధి రాంచందర్ గౌడ్, గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారాం, అధ్యక్షులు నోముల శ్రీకాంత్,పల్లే అనిల్ కుమార్, పోచమ్మల గణేష్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిసె ప్రభు, మల్లికార్జున్ గౌడ్ సుజాత, పాల్గొనడం జరిగింది.

# వృత్తి నిబద్ధతతోనే ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు

**కోవిడ్ పాండమిక్ లో డాక్టర్ శ్రవన్ సేవలు ఎంతో విలువైనవి**
**సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్రవన్ కు వీడ్కోలు సెర్మనీ**

**సికింద్రాబాద్, ఆగస్టు07 (సిద్దిపేట పవర్) :**



సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి గ్యాస్ట్రోఎంట్రాలజీ హెచ్ఓడీ ప్రొఫెసర్ పొరిక శ్రవణ్‌కుమార్ పేషంట్లకు అందించిన సేవలు అభినందనీయమని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. ఇందిర, సూపరింటెండెంట్ డా. రాజకుమారిలు అన్నారు. గాంధీలో విధులు నిర్వహిస్తు ప్రమోషన్పై అడిషనల్ డీఎంఈ, సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ట్రాన్స్ ఫర్ అయిన శ్రవణ్‌కుమార్‌కు గురువారం గాంధీ అలుమ్నీ ఆడిటోరియంలో వీడ్కోలు అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతు..తన అంకితభావమైన వృత్తి నిబద్దతతో గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగానికే వన్నె తెచ్చిన శ్రవణ్‌కుమార్ మరిన్ని ఉన్నతశిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. సహనం, ఓర్పు, చిత్తశుద్ధి, ఇష్టంతో విధులు నిర్వహించే విజయం సాధించవచ్చని, కరోన పాండమిక్ సమయంలో గాంధీ సూపరింటెండెంట్‌గా, కోవిడ్ స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా మెరుగైన సేవలు అందించిన శ్రవణ్‌కుమార్ వేలాది మందికి పునర్జన్మ ప్రసాదించారని కొనియాడారు. సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో గ్యాస్ట్రోఎంట్రాలజీనే ఎంచుకునేందుకు ఆయనే రోల్ మోడలని పలువురు పీజీ డాక్టర్లు స్పష్టం చేశారు. మూడు పద్మశ్రీ అవార్డుల గ్రహీత, ఏఐజీ ఆస్పత్రుల వ్యవస్థాపకచైర్మన్ నాగేశ్వరరెడ్డి వద్ద తాను గ్యాస్ట్రోఎంట్రాలజీలో నైపుణ్యం నేర్చుకున్నానని, వైద్య విద్యలో మాత్రమే తన మొదటి గురువు విశ్రాంత ప్రొఫెసర్ పాండురంగారావు అని శ్రవణ్‌కుమార్ వివరించారు. తన సేవలను గాంధీ వైద్య విద్యార్థులు, పేషంట్లకు జూమ్ మీటింగ్స్ ద్వారా అందిస్తానని స్పష్టం చేశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శాలువ కప్పి ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, ఆర్ఎంఓ-1 శేషాద్రి, శ్రవణ్‌కుమార్ తండ్రి ధనుంజయ, వైద్యులు సునీల్‌కుమార్, రమేష్, రామన్న, అభిలాష్, భరణీ, ఈశ్వర్, రమాకాంత్, వెంకటేష్ రోమన్, గాంధీ మేనేజర్ వెంకట రమణ, అసిస్టెంట్ మేనేజర్ శివరామిరెడ్డి, పీజీలు, వైద్యవిద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు



## తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటివి

**నంగునూరు ఆగస్టు 7 (సిద్దిపేట పవర్)**

నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వరూప ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలను వారం రోజులపాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తల్లి పాలు బిడ్డకు ఎంత అవసరమో తెలియజేయడమే ఈ కార్య క్రమం ముఖ్యఉద్దేశం అని ఆమె చెప్పారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లి పాలు తప్ప ఏ ఇతర ద్రవపదార్థాలు తాగించకూడదని తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోనే తల్లియొక్క పసుపు రంగు చిక్కటి పాలు (ముర్రుపాలు) అమఅతం లాంటివని ఆమె పేర్కొన్నారు. వీటి ద్వారా బిడ్డకు అతిముక్యమైన పోషకాలు లభిస్తాయని తెలిపారు. తల్లిపాలు బిడ్డ శరీరానికి, మెదడు కూడా పోషణను ఇస్తుందన్నారు. తల్లి పాలలో వున్న పోషక గుణాలు మరి ఏ ఇతర పాలల్లో వుండవని స్పష్టం చేశారు. మరి ముఖ్యంగా తల్లిపాలు శిశువును న్యుమోనియా, అతిసార వ్యాధి వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుండి కాపాడుతుందని ఆమె చెప్పారు. ఆరు నెలు నిండిన పిల్లలకు అన్నప్రసాన్నం చెయడం జరిగింది ఈ కార్యక్రమంలో భవాని లావణ్య ఆశావర్కర్ చంద్రకళ మమత తల్లులు గర్భవతులు బాలింతలు తదితులున్నారు

## పాము కాటుకు గురై పాడి గేదె మృతి

**నంగునూరు, ఆగస్టు 07 (సిద్దిపేట పవర్)**



పాము కాటుకు గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. అక్కెనపల్లి గ్రామానికి చెందిన సంద యాదగిరి తండ్రి మల్లయ్య అనే రైతు రోజు మాదిరిగానే తన పాడి గేదెను బుధవారం సాయంత్రం తన వ్యవసాయ పొలం వద్ద గల బర్రెల కొట్టంలో కట్టేసి ఇంటికి వెళ్ళాడు. గురువారం రోజున ఉదయం తన బర్రెల కొట్టంలో కట్టేసి ఉన్న పాడి గేదె మృత్యువాత పడి ఉంది. దీంతో సుమారు 90 వేల విలువ గల పాడి గేదె మృత్యువాత పడడంతో రైతు యాదగిరి రోదించాడు. తనను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

## సీపీస్ రద్దు కు సెప్టెంబర్ 1న పి ఆర్ టి యూ ఆధ్వర్యంలో మహా ధర్నా

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**



జగదేవపూర్ మండలంలో పి ఆర్ టి యు మండల శాఖ అధ్యక్షులు చిలుకూరి వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదులో పి ఆర్ టి యు సిద్దిపేట జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఆదరాసు పల్లి శశిధర్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ముఖ్యంగా సిపిఎస్ రద్దు చేయకుంటే సెప్టెంబర్ 1 నాడు పదివేల మంది ఉపాధ్యాయులతో* పిఆర్టియు ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా చేస్తామని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి రాష్ట్ర శాఖ పిలుపు ఇచ్చారని ముఖ్యంగా సిపిఎస్ ఉపాధ్యాయులంతా కదిలి ధర్నాలో పాల్గొనాలని అన్నారు.ఆగస్టు 15 లోపు పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలోనే ఉపాధ్యాయుల కు హెల్త్ కార్డులు మంజూరు కాబోతున్నాయని, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు హెచ్ఎం పోస్ట్ లు మంజూరు చేయాలని అన్నారు. ఇంకా ఈ సభ్యత్వ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు చిలుకూరు వెంకట్రాంరెడ్డి సీనియర్ నాయకులు పిన్నింటి రామకృష్ణారెడ్డి ,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వంగ శ్రీనివాసరెడ్డి, రఘురాములు, మండల కార్యవర్గ సభ్యులు నగేష్, భగవాన్ రెడ్డి, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్ర ప్రదర్శన చేసిన దేశీ డీలర్లు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**

తెలంగాణ రాష్ట్ర రాజేంద్రనగర్ లోని మేనేజ్ మరియు వ్యవసాయ శాఖ సమేతి కలిసి నిర్వహిస్తున్న ఎక్స్టెన్షన్ వర్కర్స్(దేశీ )ఫర్టిలైజర్ షాపు డీలర్లకి మరియు రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన చేయుట కోసం ఈరోజు మర్కుక్ మండలంలోని నరసన్నపేట చెక్కుడ్యాం నీటి కుంటలు ఎర్రవల్లి గ్రామంలోని మిట్టపల్లి రాజిరెడ్డి ఫామ్ ఆయిల్ తోటలో వారి యొక్క అనుభవాలు తెలుసుకోవడం జరిగింది బస్వాపూర్ గ్రామానికి చెందిన రైతు లోలాకర్ రెడ్డి గారి డ్రాగన్ ఫ్రూట్ తోటను సందర్శించి తోట యొక్క పెట్టుబడి లాభనష్టాల గురించి తెలుసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా డీలర్ సోదరులు మరియు ప్రోగ్రాం ఫెసిలిటీలేటర్ పి శంకర్ రావు గారు బాలరాజు కనకయ్య రమేష్ అరవింద్ పద్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ దారుణ పరిస్థితులపై మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం

**అడ్వకేట్ రామారావు పిటిషన్ కు స్పందన: కేసు నమోదు**
**అక్టోబర్ 27 లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం**

**సికింద్రాబాద్, ఆగస్టు07 (సిద్దిపేట పవర్) :**



సికింద్రాబాద్ గాంధీ దవాఖానల దారుణమైన పరిస్థితులపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం సీరియస్ అయింది. ఏడాది కాలం నుంచి లిఫ్టులు సరిగా పని చేస్తుండకపోవడంతో డాక్టర్లు, పేషెంట్లు, నర్సులు, మెట్లు ఎక్కడానికి , దిగడానికి ఇబ్బందులు పడుతున్నారని సిటీకి చెందిన ప్రముఖ అడ్వకేట్ రామారావు ఇమ్మానేని గతంలో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించారు. అలాగే వంటగదుల్లో జిర్ర పురుగులు తిరుగుతున్నాయని, పేషంట్లు పడుకునే బెడ్లు నాణ్యతగా లేవని తన ఫిర్యాదు లోపేర్కొన్నారు. ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేవని, ఆసుపత్రిలో రోగులు, డాక్టర్లు ఎదుర్కొనే సమస్యల గురించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో వార్త కథనాలు వస్తున్నప్పటికీ సంబందిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని అడ్వకేట్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఆసుపత్రి కి చెందిన డ్రైనేజీ వ్యవస్థ పూర్తి దారుణంగా తయారైందన్నారు. మురుగు నీరు ఆసుపత్రి ఆవరణలో పొంగుతుందని, దుర్వాసన, దోమలతో రోగులు మరింత అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. కుక్కల బెడద బాగా పెరిగిందని, నేరుగా పై అంతస్తుల్లోని రోగుల వార్డుల్లోకి వస్తూ, అందరిని భయప్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. ఇక పోస్టుమార్గం నిర్వహించే మార్చురీ లో అయితే పరిస్తితులు దారుణంగా ఉన్నాయి. శవాలు రోజుల తరబడిగా పేరుకుపోతుండటంతో, అవి పూర్తిగా కుళ్ళిపోయి, భరించలేదని దుర్వాసన చుట్టు ప్రాంతాలకు వ్యాపిస్తుంది. దాంతో పద్మారావునగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల తరచుగా ఆసుపత్రి ప్రధాన విభాగాలు, అత్యవసర వైద్య సేవలు అందించే ఎమర్జెన్సీ బ్లాకుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో రోగులు, డాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే గాంధీలో నెలకొన్న దారుణ పరిస్థితులపై సమీక్షించి, చర్యలు తీసుకోనేలా ప్రభుత్వ వైద్య విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ కు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ లో కోరిన న్యాయవాది రామారావు పిటిషన్ ను మానవ హక్కుల కేసు 4051/2025 గా నమోదు చేసి ఆగస్ట్ రెండో తారీఖున విచారణకు స్వీకరించింది. అక్టోబర్ 27 లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ కు నోటీసును ఇచ్చినట్లు అడ్వకేట్ రామారావు తెలిపారు.

## ఘనంగా ట్రస్ట్ చైర్మన్ జన్మదిన వేడుకలు

**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉల్లెంగల ఏకానందం జన్మదిన వేడుకలు**

**చేర్యాల, ఆగస్టు 7 (సిద్దిపేట పవర్)**





చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు ఉల్లెంగల ఏకానందం జన్మదిన వేడుకలు ఆకునూరు గ్రామ నాయకులు, ప్రజలు వైభవంగా జరిపారు.. మొదట ఆకునూరు నాయకులు కరీంనగర్ లో నీ ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు..ఈ సందర్భంగా ఏకానందం మాట్లాడుతూ నేను ఎక్కడ ఉన్నా, ఏ స్థాయిలో ఉన్న నాకు మా గ్రామ ప్రజలు అందించే ఆశీస్సులు ఎప్పటికీ ప్రత్యేకమే అని తెలిపారు..నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు అని తెలిపారు.. తరువాత ఆకునూరు గ్రామంలో ఏకానందం పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిపారు..కార్యక్రమంలో పుప్పాల మహేందర్, కోతి దాసు, శనిగరం లక్ష్మణ్, పోరండ్ల వెంకటేష్, చక్రి, బాపు శ్రీనివాస్, కన్నెబోయిన శ్రీనివాస్, అంజయ్య, గోనెపల్లి మహేష్, మీనుగు హరీష్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

## నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు రామబాణంగా నియంత్రణ చేస్తాయి

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బల్వీర్ సింగ్**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**



జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని మండల ప్రజా పరిషత్ గజ్వేల్ కార్యాలయంలో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై మండల టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బల్వీర్ సింగ్ మాట్లాడుతూ ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు రోజున వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, పాఠశాలల ఉపాధ్యాయులు కలిసి సంయుక్తంగా ఆల్ బెండజోల్ మాత్రలు ప్రతి అంగన్ వాడి ,ప్రతిపాఠ శాలలో, ప్రతి కళాశాలలో పిల్లలకు వేయుట ( తినిపించుట) జరుగును తల్లిదండ్రులు తమ పిల్లలకు అల్బెంజోల్ మాత్రలు తినిపించాలని తెలిపారు. వేసుకొని పిల్లలు 18825 మాన్ అఫ్ రోజున వేసుకోవాలి కడుపులో నులిపురుగులు ఉండడం వల్ల ఆకలి కాకపోవడం, పిల్లలుమగతగాఉండడం కడుపులో నొప్పి అంటూ అన్నం సరిగా తినలేకపోవడం, ఆరోగ్య సమస్యల వల్ల చదువుకోలేకపోవడం

పిల్లవాడు ఎప్పుడు అలసి పోయినట్లు ఉండడం, రక్తహీనత తొ బాధపడడం చిన్న పని చేసిన చెమటలు రావడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. అదేవిధంగా 1 నుండి 19 సంవత్సరాల పిల్లలు అందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని ఇవి రామ బాణములగా పనిచేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అహ్మదిపూర్ వైద్యాధికారి డాక్టర్ ప్రణయ్ రాజ్ ఐసిడిఎస్ సిడిపిఓ సరిత సి.హెచ్.ఓ, యంమ్.ఆర్.ఓ యం.పి.డి.ఓ ఖాసిం ఎంపిహెచ్ఓ సత్యనారాయణరెడ్డి అంగన్వాడి సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు .

# తమ్మిడిహట్టి పట్టుకొని గోదారి ఈదొచ్చా!?

**మొదటిపేజీ తరువాయి**

వందల పేజీల నివేదిక తయారు చేయిస్తరు. దాన్ని పట్టుకొని గోదావరి ఎందుకు ఈదలేదని ఎదుటోళ్ల మీద నిందలు వేయిస్తరు.

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): సమైక్య రాష్ట్రంలో తెలంగాణ సాగునీటి వ్యవస్థ అంటేనే పాలకులకు ఓ సర్కస్ లాంటిది. అందుకే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ఏ ప్రాజెక్టు పొట్టవిప్పినా పొరుగు రాష్ట్రాలతో కొట్లాటలు, నీటి లభ్యత లేకపోవడం, అటవీపర్యావరణ చట్టాల చట్రాల్లో బంధించడం తప్ప కొసెల్లిన ప్రాజెక్టు ఒక్కటీ లేదు. పట్టుమని పదెకరాలు తడిసిన ఆయకట్టు లేదు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు పదవులు, కాంట్రాక్టు పనుల ఎర చూపి వినోదం చూసేవాళ్లు. అందులో నుంచి పుట్టుకొచ్చిందే ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు. పదహారు లక్షల ఎకరాల ఆయకట్టు. మరి.. ఇంత పెద్ద ప్రాజెక్టు కట్టేముందు ఎక్కడ బరాజ్ కట్టాలి? ఎక్కడి నుంచి నీళ్లు మళ్లించుకోవాలి? అసలు అక్కడ ఉన్న నీళ్లెన్ని? ఎన్ని ఎత్తిపోసుకోవచ్చు? ఇంతకీ అనుకున్న ఆయకట్టుకు అవి సరిపోతయా? అని చూడాలి కదా. ఇందుకోసం సర్వేలు చేయాలి కదా. ప్రభుత్వం ఓ కమిటీని వేసి అధ్యయనం చేయించాలి కదా. ఇవేవీ జరగలేదు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాదు.. 18 నెలల కిందట అధికారంలోకి వచ్చిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ్మిడిహట్టి దగ్గర బరాజ్ కట్టాలని ఎవరు, ఎట్ల ఎంపిక చేశారో ఇంతవరకూ చెప్పలేదు. కనీసం 665 పేజీల జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికలోనైనా ఎక్కడైనా.. మచ్చుకైనా.. తమ్మిడిహట్టి దగ్గర బరాజ్ కట్టాలని ఫలానా నిపుణులు తేల్చారనే ఆధారాలు చూపలేదు. ఎంతసేపు తమ్మిడిహట్టి దగ్గర ఎందుకు బరాజ్ కట్టలేదు? అక్కడి నుంచి బరాజ్‌ను మేడిగడ్డకు ఎందుకు మార్చారు? ఇదే రొడ్డకొట్టుడు వితండవాదనే!

**గత ఒప్పందాలనైనా పట్టించుకున్నారా?**

ఒక అంతర్రాష్ట్ర ప్రాజెక్టు చేపడుతున్నపుడు ముందుగా పొరుగు రాష్ట్రంతో గతంలో ఏమైనా ఒప్పందాలు ఉన్నాయా? అని ఒక్కసారైనా సమీక్షించుకోవడం నిర్మాణం చేపడుతున్న రాష్ట్రం బాధ్యత. కానీ ప్రాణహితచేవెళ్లలో గుడ్డిగా బరాజ్ ఎంపిక చేసిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం.. గత ఒప్పందాలను సైతం విస్మరించింది. గోదావరితోపాటు దాని ఉప నదులకు సంబంధించి 6.10.1975తోపాటు 7.8.1978న ఏపీమహారాష్ట్ర మధ్య ఒప్పందాలు జరిగాయి. ఇందులో భాగంగా ఏ రాష్ట్రమైనా ప్రాణహితపై బరాజ్ నిర్మాణం చేపట్టి తమ భూభాగంలోని ఆయకట్టుకు సాగునీరు అందించాలనుకుంటే ఇతర రాష్ట్రంలోని ముంపు అంశాన్ని పరిగణనలోనికి తీసుకోవాలి. సదరు రాష్ట్రంతో అనుమతి తీసుకొని, పరస్పర ఒప్పందంతోనే బరాజ్ నిర్మాణాన్ని చేపట్టాలని స్పష్టంగా పేర్కొనబడి ఉన్నది. కానీ అప్పటి ఏపీ ప్రభుత్వం దానిని విస్మరించి ముందుకుపోయింది. దీంతో మహారాష్ట్ర ప్రభుత్వమే ముందుకొచ్చి రెండు రాష్ట్రాల ఇంజినీర్లతో అంతర్రాష్ట్ర బోర్డు (ఐఎస్‌బీ) ఏర్పాటు చేసుకుందామని 2010 అక్టోబరులో లేఖ రాసింది. ముంపు అంశాలపై చర్చించి, ఓ నిర్ణయానికొద్దామని సూచించింది. అయినప్పటికీ రెండేండ్లపాటు ఏపీ ప్రభుత్వం కాలయాపన చేసింది. చివరకు 2012 మే నెలలో రెండు రాష్ట్రాల మధ్య అంతరాష్ట్ర ఇంజినీర్ల బోర్డు ఏర్పాటుపై ఒప్పందం జరిగింది. ముంపుపై అధ్యయనం, సమగ్ర ప్రాజెక్టుపై నివేదిక (డీపీఆర్) రూపొందించడం, ఇతర అంశాలపై పరిష్కారానికి ఈ బోర్డును ఏర్పాటు చేశారు.

**కాంట్రాక్టులు.. మొబలైజేషన్ అడ్వాన్సులు**

అరిగోస పడుతున్న రైతులకు సాగునీరు అందించాలనే ధ్యాస ఏనాడూ తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో లేదనేందుకు ఆరు దశాబ్దాల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రైతుల దుస్థితి నిదర్శనం. ఎంతసేపు కాంట్రాక్టులు పట్టుకోవాలి, మొబిలైజేషన్ అడ్వాన్సులు దండుకోవాలనే ధ్యాస మాత్రమే. ఎక్కడైనా సాగునీటి ప్రాజెక్టుల్లో నది నుంచి నీళ్లు మళ్లించే పనులు మొదలుపెట్టి.. ఆ పైన కాల్వలు, సొరంగాలు తవ్వుకుంటరు. మరి నది నుంచి నీళ్లు మళ్లించాలంటే తమ్మిడిహట్టి దగ్గర బరాజ్ కట్టాలి. మహారాష్ట్రఏపీ సరిహద్దులో ఉన్న తమ్మిడిహట్టి దగ్గర బరాజ్ కట్టాలంటే మహారాష్ట్రతో అంతర్రాష్ట్ర ఒప్పందం జరగాలి. కానీ ఉమ్మడి పాలకులు అవేవీ పట్టించుకోలేదు. తెలంగాణ నేతలూ అడగలేదు. ఎంతసేపు టెండర్లు వేసి పనులు దక్కించుకోవాలనే యావ. అందులో భాగంగా 2008లో ఏకంగా ఆరు చోట్ల ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపనలు చేసి ఎడాపెడా కాలువలు, సొరంగాలు తవ్వారు. ఇట్ల 2014 అంటే తెలంగాణ ఏర్పడే వరకు ఏం చేశారంటే ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కాలువలు తవ్వడమే. బరాజ్ కట్టకుండానే, దాదాపు ఏడేండ్లపాటు సుమారు రూ.7వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారు. అందులో సుమారు రూ.3,500 కోట్ల వరకు పనులు జరిగితే మిగిలినదంతా మొబిలైజేషన్ అడ్వాన్సులు దండుకోవడమే.

**మహారాష్ట్ర సీఎం చెప్పినా పెడచెవిన..**

ప్రాణహిత జలాలను మళ్లించేందుకు తమ్మిడిహట్టి దగ్గర బరాజ్ కట్టాలని ఏ నిపుణుల కమిటీ సూచించలేదు. ముందు ఎలాంటి అధ్యయనమూ జరగలేదు.



గుడ్డిగా ఆ ప్రదేశాన్ని ఎంపిక చేసిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బరాజ్ నిర్మాణంపై మహారాష్ట్రతో సంప్రదింపులను నామమాత్రంగా కొనసాగించింది. చివరకు రెండు రాష్ట్రాలు ఏర్పాటు చేసుకున్న ఐఎస్‌బీలో బరాజ్ ఎత్తుపై అనేక దఫాలుగా జరిగిన సమావేశాల్లో ఏకాభిప్రాయం కుదరలేదు. తాము ఎట్టి పరిస్థితుల్లో 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి అంగీకరించేది లేదని మహారాష్ట్ర తెగేసి చెప్పింది. ఆ మేరకు వారిని ఒప్పించడమో, ఎత్తును తగ్గించడమో ఏదోఒకటి చేసి పనులు చేపట్టాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బరాజ్ నిర్మాణాన్ని గాలికొదిలేసింది. అయినా ఎడాపెడా వేల కోట్ల విలువైన కాలువలు, సొరంగాల పనులు చేస్తుండటంతో 2013లో అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చౌహాన్ అప్పటి ఏపీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి ఘాటుగా లేఖ రాశారు. 'ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తమ్మిడిహట్టి దగ్గర నిర్మించాలనుకున్న బరాజ్ ఎత్తుపై ఇప్పటికీ రెండు రాష్ట్రాల మధ్య పరస్పర అవగాహన కుదరలేదు.

తమ్మిడిహట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మిస్తే.. చంద్రాపూర్ జిల్లాలోని 22 గ్రామాలు, గడ్చిరొలి జిల్లాలోని ఎనిమిది గ్రామాల పరిధిలోని 2,099 హెక్టార్ల భూములు ముంపునకు గురవుతాయని మహారాష్ట్ర రైతాంగం పెద్దఎత్తున ఆందోళన చేపడుతున్నారు. కానీ మీరు (ఆంధ్రప్రదేశ్) 152 ఎత్తులో బరాజ్ నిర్మాణాన్ని ప్రామాణికంగా తీసుకొని ఏకపక్షంగా పనులు కొనసాగిస్తున్నారు. మహారాష్ట్రకు సంబంధించి అనేక అంశాలతో ముడిపడి ఉన్న ఈ ప్రాజెక్టుపై పరస్పర అవగాహన కుదరకుండా ఏకపక్షంగా ముందుకుపోయినట్లయితే పనుల కోసం ఖర్చు చేస్తున్న వేలాది కోట్ల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది' అని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. వాస్తవాలన్నీ ఇలా ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా తమ్మిడిహట్టి జపం చేయడం, దానిని ఘోష్ కమిటీ తన నివేదికలో పొందుపర్చడం చూస్తుంటే చెవిటోడి ముందు శంఖం ఊదినట్టే ఉన్నది.

**తమ్మిడిహట్టి దగ్గర మరో పీటముడి**

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల చుట్టూ ఎంతటి విషవలయం ఉంటుందో అనేందుకు ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు ప్రత్యక్ష ఉదాహరణ. ఒకవైపు నీటిలభ్యత లేదు.. మరోవైపు బరాజ్ ఎత్తుపై మహారాష్ట్ర అంగీకారం లేదు.. వీటన్నింటికీ తోడు తమ్మిడిహట్టి దగ్గర ప్రతిపాదిత బరాజ్ ప్రాంతం చాప్రాల్ వన్యప్రాణి అభయారణ్యంగా కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ నోటిఫై చేసింది. అంటే సాధారణంగా అక్కడ జన సంచారాన్ని అనుమతించరు. శ్రీశైలం సొరంగం నిర్మాణం రాజీవ్ టైగర్ రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో చేపట్టినందునే జనసంచారం ఉండొద్దని డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో సొరంగ నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వలేదు. అందుకే అక్కడ అటవీ ప్రాంతంలో భూ ఉపరితలంపైకి రాకుండా భూమి లోపలే టన్నెల్ బోరింగ్ విధానంలో సొరంగ నిర్మాణాన్ని చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అట్లాంటిది.. వన్యప్రాణి అభయారణ్యం ఉన్న ప్రాంతంలో గునపంతో తవ్వడమే అసాధ్యమంటే ఏకంగా భారీ యంత్రాలతో బరాజ్ నిర్మాణాన్ని చేపట్టాలంటే ఎన్నిరకాల అనుమతులు కావాలి! ప్రధానంగా కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖనే కాదు... సుప్రీంకోర్టు అనుమతి ఉంటే తప్ప అక్కడ పనులు చేపట్టడం సాధ్యం కాదు. మరి.. పొరుగున మహారాష్ట్రతో ఒప్పందమే చేసుకోలేని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అనుమతి సాధిస్తుందనుకోవడం నమ్మశక్యమేనా? పైగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏడేండ్లపాటు ఈ అనుమతులకు సంబంధించి అసలు ప్రయత్నాలే మొదలుపెట్టకపోవడం అంటే తమ్మిడిహట్టి బరాజ్ కట్టాలనుకున్నారా? కాల్వలు తవ్వి బిల్లులు దండుకోవాలనుకున్నారా? అనేది అర్థం చేసుకోవచ్చు. మరి.. ఈ క్రమంలో బాధ్యతాయుతమైన ఘోష్ కమిషన్ కనీసం ఈ అంశాన్ని ప్రస్తావించాలి కదా.

**తమ్మిడిహట్టిపై కుండబద్దలు కొట్టిన జలసంఘం**

పదేండ్లు ఉమ్మడి ఏపీలో, కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తమ్మిడిహట్టి దగ్గర చిన్న బరాజ్ కట్టకపోగా.. తమ పార్టీయే అధికారంలోనే ఉన్న మహారాష్ట్రతో కనీసం ఒప్పందం కూడా చేసుకోలేకపోయింది. అయినప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం మహారాష్ట్రను ఒప్పించాలనుకున్నా అక్కడి ప్రభుత్వం అంగీకరించే స్థితిలో లేదు. ఈ సమయంలోనే కేంద్ర జలసంఘం పిడుగులాంటి వార్తల్ని లేఖల రూపంలో పంపింది. 4.3.2015 తేదీన, 18.2.2015 తేదీన కేంద్ర జలసంఘం రెండు లేఖల్ని తెలంగాణ నీటిపారుదల శాఖకు పంపింది. అందులో స్పష్టంగా తమ్మిడిహట్టి దగ్గర 165 టీఎంసీల నీటి లభ్యత కనిపిస్తున్నప్పటికీ.. అందులో మహారాష్ట్ర మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా తన వాటాగా ఉన్న 63 టీఎంసీలు కూడా ఉన్నాయని స్పష్టంచేసింది. ఎగువ రాష్ట్రాల్లో నీటి వినియోగాన్ని పరిశీలిస్తే 75 శాతం విశ్వసనీయత కంటే ఎక్కువగా ఉన్నందున భవిష్యత్తులో తమ్మిడిహట్టి దగ్గర నీటి లభ్యత 165 టీఎంసీలకుగాను 102 టీఎంసీలకు పడిపోతుందని హెచ్చరించింది. ఈ క్రమంలో ప్రాణహితచేవెళ్లలో భాగంగా తమ్మిడిహట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తులో 5 టీఎంసీల నీటి నిల్వతో బరాజ్ నిర్మిస్తేనే ఈ పరిస్థితి ఉంటుందని చెప్పింది.

కానీ 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే బరాజ్‌లో నీటి నిల్వ కేవలం 1.4 టీఎంసీలకు పడిపోతుంది. తద్వారా ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా 160 టీఎంసీల జలాల మళ్లింపు అనేది అసాధ్యమని కుండబద్దలు కొట్టింది. అలాంటప్పుడు 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఎలా అందిస్తారని ప్రశ్నించింది. ఇవన్నీ కాకుండా 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పుకుంటున్న ఈ ప్రాజెక్టులో 16.5 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ప్రతిపాదిస్తున్నారని, అది కూడా తమ్మిడిహట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తులో బరాజ్ కడితేనే! ఒకవేళ 148 మీటర్ల ఎత్తులో కడితే నిల్వ 11.4 టీఎంసీలకు పడిపోతున్నందున ఆయకట్టుకు సాగునీరు ఎలా అందుతుందని మరో లోపాన్ని ఎత్తిచూపింది. అప్పటి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి ఉమాభారతి సైతం 13.3.2015న రాసిన లేఖలోనూ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం నదిలో పర్యావరణహిత ప్రవాహాలు (ఎకోలాజికల్ ఫ్లోస్) కూడా ఉండాల్సిన దరిమిలా 75 శాతం విశ్వసనీయతపై తమ్మిడిహట్టి దగ్గర మళ్లింపునకు 160 టీఎంసీల నీటి లభ్యత ఉండకపోవచ్చని, ఈ క్రమంలో ప్రత్యామ్నాయ వ్యూహాన్ని చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా నీటి నిల్వపైనా హెచ్చరించారు. ఇవన్నీ వివరాలు కేంద్ర జల సంఘం, కేంద్ర మంత్రి లేఖల్లో కూలంకశంగా ఉన్నాయి. ఘోష్ కమిషన్‌కు ఈ లేఖలు కూడా అందాయి. అయినా కాంగ్రెస్ నేతల చేసిన తమ్మిడిహట్టి జపాన్నే ఘోష్ కమిషన్ తన భుజాన వేసుకొని నివేదికను రూపొందించినట్టు అర్థమవుతున్నది.

**మహారాష్ట్రతో సంప్రదింపులు కొనసాగించిన కేసీఆర్ ప్రభుత్వం**

తెలంగాణ ఏర్పడేనాటికి ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు అంటే ఉమ్మడి ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో మొండి కాల్వలు, సొరంగాలు తప్ప కీలకమైన బరాజ్ నిర్మాణంపై కించిత్ పురోగతి లేదు. ఈ నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వం మహారాష్ట్రతో సంప్రదింపులు కొనసాగించింది. 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి ఐఎస్‌బీలో చర్చించింది. కానీ అప్పటి మహారాష్ట్ర సీఎం పృథ్వీరాజ్ చౌహాన్ ససేమిరా అన్నారు. ఆ సమయంలోనూ పలు దఫాలుగా ఐఎస్‌బీ సమావేశాలు జరిగాయి. ఆపై మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు రావడం అనంతరం తమ్మిడిహట్టి బరాజ్ నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాడిన బీజేపీ.. అధికారంలోకి వచ్చి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయనతోనూ సీఎంగా కేసీఆర్ స్వయంగా మాట్లాడినప్పటికీ.. 152 మీటర్ల బరాజ్ నిర్మాణానికి తమ ప్రభుత్వం అంగీకరించేదిలేదని ఆయన కుండబద్దలు కొట్టారు. ఇది తెలంగాణ సమాజం కండ్లముందు జరిగిన చరిత్ర. కాంగ్రెస్ పార్టీ నిర్వాకానికి నిలువెత్తు సాక్ష్యం. కానీ ఘోష్ కమిషన్‌లో ఇవేవీ లేవు. తమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ మార్చడంలో నిజాయితీ లేదంటూ కమిషన్ చిలుకపలుకలు పలికిందే తప్ప వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా విస్మరించింది. కాంగ్రెస్ కూడా మీడియా సమావేశాల్లో పాడిందే పాడరా అన్నట్టుగా తమ్మిడిహట్టిపై మాట్లాడుతున్నదే కానీ, ఎక్కడా 152 మీటర్ల బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించేలా చేసిన ప్రయత్నాలను ప్రజలముందు ఉంచడంలేదు.

**పుష్కర కాలం కిందటే బండారం బయటపెట్టిన కాగ్**

పదేండ్లలో ఒక్క బరాజ్ కట్టలేని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మూడేండ్లలోనే పూర్తయిన ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరంపై విషం చిమ్మే దుస్సాహసానికి ఒడిగడుతున్నది. ఇప్పుడు కాంగ్రెస్ నేతలు నిత్యం వల్లె వేస్తున్న ప్రాణహితచేవెళ్ల, తమ్మిడిహట్టి బరాజ్ కథేందో.. దాని వెనక అసలు బండారం ఏందో అని 2013లోనే కాగ్ బట్టబయలు చేసింది. అదీ ఆ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే. అయినా.. నవ్విపోదురుగాక! అన్నట్టు ఇప్పటికీ కాంగ్రెస్ నాయకులు ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును అదేదో గొప్ప నిర్ణయం అన్నట్టుగా అభివర్ణించుకోవడం విడ్డూరం. అందులోని కొన్ని ప్రధాన అంశాలను చూస్తే అసలు తమ్మిడిహట్టి దగ్గర నీటిలభ్యత లేదని కేంద్ర జలసంఘం హెచ్చరించినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని స్వయంగా కాగ్ తప్పుపట్టింది.

దీంతోపాటు ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు అంచనా వ్యయం 17,875 కోట్లు. ఆ మేరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో పరిపాలనాపరమైన ఆమోదం తెలిపింది. కానీ అంతర్రాష్ట్ర ఒప్పందం జరగకుండానే, కీలకమైన పనులు మొదలుకాకుండానే, అసలు తమ్మిడిహట్టి దగ్గర బరాజ్‌కు శంకుస్థాపన ఫలకం పడకముందే అంచనా వ్యయం రూ.38,500 కోట్లు అంటే 115 శాతానికి ఎగబాకినట్టు స్పష్టంచేసింది. అదేవిధంగా కాంట్రాక్టు పనుల అప్పగింత, గడువులోగా పనులు పూర్తికాకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా మొబిలైజేషన్ అడ్వాన్సుల చెల్లింపు ఇలా అనేక రకాల అవినీతి బాగోతాలనూ కాగ్ బయటపెట్టింది. అంటే ఒక అసంపూర్ణ నిర్ణయం.. అసంబద్ధమైన ఎంపిక.. అందులోనూ అవినీతి.. అన్నీ కలిసి కాంగ్రెస్ చెప్తున్న తమ్మిడిహట్టి!

మబ్బుల్లో నీరు చూసి ముంత ఒలకబోసుకుంటారట. కుళ్లు రాజకీయాలతో నీళ్లను ముడిపెట్టే తిక్కమూక ఉన్నపండ్లు ఊడగొట్టుకుని కట్టుడు పండ్లతో ఇకిలిస్తారట. కండ్ల ముందున్న జలభాండం కాళేశ్వరాన్ని కాదనుకుని తమ్మిడిహట్టి అంటూ తలకు మాసిన మాటలు. కూర్చున్న కొమ్మనే తెగనరుక్కునే సయ్యాటలు. కేసీఆర్ చతురతతో వెలసిన మహాజల సౌధాన్ని కక్షలూ కార్పణ్యాలతో కూల్చేద్దామని యావ. రాష్ట్రప్రజల జలధీమాతో అలవిమాలిన చెలగాటం. పిచ్చి కుదిరింది రోకలి తలకు చుట్టమన్నట్టు తమ్మిడిహట్టి బులపాటం. టీఎంసీకి, క్యూసెక్కులకు తేడా తెలియని బిత్తిరి సంత ప్రాజెక్టు కడతామంటూ ప్రగల్భాలు. బేసిన్‌కు క్యాచ్‌మెంట్‌కు తేడా తెలియని గుండన్న కుప్పిగంతులు. అసలు వీళ్లకు తమ్మిడిహట్టి ఎక్కడుందో తెలుసా? అక్కడే ఎందుకు కట్టాలో.. ఏ ప్రాతిపదికన కట్టాలో చెప్పమంటే డుమ్మీలు వేసే డమ్మీలు. అక్కడ కావాల్సినంత నీటి లభ్యత లేదనేది నిపుణులు తేల్చిన నికార్సయిన నిజం. ఆపైన కావాల్సినంత ఎత్తు కట్టుకోలేము అనేది విజ్ఞులు ఖరారు చేసిన సంగతి. ఇది సూర్యుడు తూర్పున ఉదయిస్తాడన్నంత నికరమైన సత్యం. కానీ ఇక్కడున్నది కాసుల కక్కుర్తి బ్యాచి. ఏదో ప్రాజెక్టు ముందేసుకుని జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చుకునే కమిషన్ల సంతతి. ఆనకట్టల వెనుక నోట్లకట్టలను చూసే, మూటలు మోసే ముఠా. ఢిల్లీ పాదుషాల కోసం గల్లీని తాకట్టు పెట్టే దగుల్బాజీ దండు. తెలంగాణ సోయిలేని పొరుగు తొత్తులు. పచ్చని తెలంగాణలో పరిగెలను పరుస్తున్న విషపు విత్తులు.

**తమ్మిడిహట్టిలో నీళ్లేవి?**

తమ్మిడిహట్టి దగ్గర 165 టీఎంసీల నీటి లభ్యత కనిపిస్తున్నప్పటికీ.. అందులో మహారాష్ట్ర వాటాగా ఉన్న 63 టీఎంసీలు కూడా ఉన్నాయి. భవిష్యత్తులో తమ్మిడిహట్టి దగ్గర నీటి లభ్యత 165 టీఎంసీలకు నుంచి 102 టీఎంసీలకు పడిపోతుంది.

**– 2015 మార్చి 4న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర జలసంఘం రాసిన లేఖ**

**మరోదారి చూసుకోండి..!**

కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం నదిలో పర్యావరణ హిత ప్రవాహం కూడా ఉండాల్సిన దరిమిలా తమ్మిడిహట్టి దగ్గర మళ్లింపునకు 160 టీఎంసీల నీటి లభ్యత ఉండకపోవచ్చు. ప్రత్యామ్నాయ మార్గం చూసుకోండి.

**– 13.3.2015న రాసిన లేఖలో అప్పటి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి ఉమాభారతి**

**కాదని ముందుకెళ్తే మీకే నష్టం!**

తమ్మిడిహట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మిస్తే.. చంద్రాపూర్ జిల్లాలోని 22 గ్రామాలు, గడ్చిరొలి జిల్లాలోని ఎనిమిది గ్రామాలు ముంపునకు గురవుతాయి. మా సమ్మతి లేకుండా మీరు 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణాన్ని ఏకపక్షంగా కొనసాగిస్తే.. దానికైన ప్రజాధనమంతా వృథా కాకతప్పదు.